క్లుప్తంగా

విద్యావేత్త రాజేష్‌కు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న రాజేష్

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణానికి చెందిన విద్యావేత్త హసనబాద రాజేష్‌కు డాక్టరేట్ లభించింది. వినియోగ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి వినియోగ వస్తు బ్రాండ్ వ్యూహాలపై ఆయన పరిశోధన చేశారు. దీంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల జరిగిన 83వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్, అబోడ్ కంపెనీ సీఈఓ శంతన్ నారాయణన్ చేతుల మీదుగా ఆయనకు డాక్టరేట్ పట్టా అందజేశారు.

హ్యాండ్ బాల్ జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



చరణ్‌ను అభినందిస్తున్న ఎస్‌ఆర్‌ఎస్ కళాశాల యాజమాన్యం

కోదాడఅర్బన్ : తమిళనాడులో అక్టోబర్ 27 నుంచి 29 వరకు జరిగిన 7వ నేషనల్ ఫస్ట్‌బాల్ (హ్యాండ్ బాల్) పోటీల్లో కోదాడ పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థి కె.చరణ్ ప్రతిభ కనబరిచి మూడవ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వేణుగోపాల్, కరస్పాండెంట్ వై.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొన్న టీమ్‌కు చరణ్ కెప్టెన్‌గా వ్యవహరించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చరణ్‌ను కళాశాల చైర్మన్ వడ్డే రాజేష్‌చౌదరి, డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, అధ్యాపకులు రాయుడుతో కలిసి వారు అభినందించారు.

బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరెడ్డి



గుజ్జుల శ్రీనివాసరెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న అరుణ్‌కుమార్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హుజూర్‌నగర్‌కు చెందిన గుజ్జుల శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని ఎంపీ ఉత్తమ్ క్యాంపు కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్ మాట్లాడుతూ ఉత్తమ్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు ఐ.రామకష్టారెడ్డి, సీతారెడ్డి, జ్ఞానయ్య, వెంకటరెడ్డి, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశ ఫలితాల్లో సత్తాచాటిన అరుణ్‌తేజ



నేరేడుచర్ల : భారత వ్యవసాయ పరిశోధన మండలి -2023 సంవత్సరానికి గాను జాతీయ స్థాయిలో నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో నేరేడుచర్లకు చెందిన చిత్రం అరుణ్‌తేజ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, జాతీయ స్థాయిలో ఆరవ స్థానం సాధించి సత్తా చాటాడు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన అరుణ్‌తేజ తండ్రి చిత్రం విశ్వనాథ్ హుజూర్‌నగర్‌లో న్యాయవాదిగా పని చేస్తుండగా తల్లి ఉదయశ్రీ అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తోంది. అరుణ్‌తేజ 1 నుంచి 10వ తరగతి వరకు నేరేడుచర్లలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాల, ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ బీఎస్సీ చదివాడు. రాయ్‌పూర్‌లోని ఇందిరాగాంధీ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేశాడు.

వైన్‌షాప్ సీజ్

నడిగూడెం : మండల కేంద్రంలోని సునీత వైన్ షాప్‌ను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ కోదాడ సీఐ శ్రీనివాస్ శుక్రవారం విలేకరులకు తెలి పా రు. ఎన్నికల నేపథ్యంలో వైన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయగా నడిగూడెంలోని ప్రగతి వైన్స్‌కు చెందిన 90 మద్యం బాటిళ్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం ఉండటంతో వైన్స్ సీజ్ చేసినట్లు, ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

బస్తాకు కేజీ తరుగే తీయాలి

హుజూర్‌నగర్ : ధాన్యం కొనుగోలులో మిల్లర్లు, వ్యాపారులు బస్తాకు కేజీ మాత్రమే తరుగు తీయాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో రైస్ మిల్లుల యాజమాన్యంతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత కొన్నేళ్లుగా బస్తాకు రెండు కేజీల ధాన్యం తగ్గించి లెక్క చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, జిల్లాలో మిగతా చోట కేజీ మాత్రమే తరుగు తీస్తున్నారని మిల్లర్ల దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని తమ సంఘం సమావేశంలో చర్చించి తెలియజేస్తామని మిల్లర్లు వారికి తెలిపారు. పలు డిమాండ్లతో కూ డిన వినతిపత్రాన్ని మిల్లర్లకు అందజేశారు. అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

అకాల వర్షంతో నేలకొరిగిన వరిపైరు

నేరేడుచర్ల : మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరి పొలాలు నేలకొరిగాయి. దీంతో పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేరేడుచర్లలో 600 ఎకరాలు, జానలదిన్నెలో 300 ఎకరాలు, దిర్శించర్లలో 100 ఎకరాలు, సోమారంలో 500 ఎకరాలు, బొడలదిన్నెలో 100, కల్లూరులో 300 ఎకరాలు, పత్తేపురంలో 200 ఎకరాలు, మేడారంలో 200 ఎకరాలు, పెంచికల్‌దిన్నెలో 150 ఎకరాలు, దాసారంలో 200 ఎకరాలు, ఎల్లారంలో 150 ఎకరాలు, కల్వలదిన్నెలో 30 ఎకరాల్లో వరి పంట నెలమట్టం అయింది. కొన్నిచోట్ల నెలమట్టం అయిన వరి పొలాన్ని రైతులు కట్టలు కట్టుకుంటున్నారు. కాగా శుక్రవారం ఆయా గ్రామాల్లో నేలకొరిగిన పంట పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేశారు. మండలంలో ప్రస్తుత సీజన్‌లో 20 వేల 682 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా అకాల వర్షానికి 3250 ఎకరాలకలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ విస్తరణ అధికారి అన్వేష్ తెలిపారు. ఆయా గ్రామాల్లో పంట నష్ట వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.



నేరేడుచర్ల : పాత నేరేడుచర్లలో నేలమట్టం అయిన వరి పైరును కట్టలు కడుతున్న రైతులు



గరిడేపల్లిలో నేలకొరిగిన వరి పొలం



మునగాలలో..

గరిడేపల్లి మండలంలో 100 ఎకరాలు

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు ఎల్బీనగర్, పొనుగోడు, మర్రికుంట, రామచంద్రాపురం, ఎర్రగుంట గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి చేతికొచ్చిన వరి పొలాలు నేలకొరిగాయి. దీంతో రైతులకు నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా సుమారు 100 ఎకరాలకు పైగా వరి పైరు నేలకొరిగినట్లు రైతులు తెలిపారు.

ఐదువందల ఎకరాల పంట నేలమట్టం

మునగాల : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సాగు చేసిన వరిపైరు గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నేలకొరిగింది. పక్షం రోజుల్లో కోతకు వచ్చే వరిపైరు నేలకొరగడంతో నష్టం కలుగుతున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా సుమారు ఐదు వందల ఎకరాల్లో వరిపైరు నేలకొరిగినట్లు రైతులు తెలిపారు.

గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

- బీఆర్‌ఎస్ హుజూర్‌నగర్ అభ్యర్థి సైదిరెడ్డి



గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పార్టీ అభ్యర్థి సైదిరెడ్డి

హుజూర్‌నగర్: తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందని బీఆర్‌ఎస్ హుజూర్‌నగర్ అభ్యర్థి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం మేళ్లచెరువు మండలం రాఘవపురం, గరిడేపల్లి మండలం రేగులగడ్డతండాకు చెందిన పలువురు హుజూర్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జక్కుల వీరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు బాలవెంకటరెడ్డి, జనిగ సైదులు, కడియం వెంకటరెడ్డి, నగేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ..

హుజూర్‌నగర్‌కు చెందిన షేక్ కుర్షీద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. శుక్రవారం మృతదేహాన్ని సైదిరెడ్డి సందర్శించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా వల్లపుదాసు సైదులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి

- కాంగ్రెస్ కోదాడ అభ్యర్థి పద్మావతి



కోదాడ : భవానీనగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

కోదాడ : కోదాడ పట్టణంలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలోని భవానీ నగర్, 26, 27 వార్డుల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన ఐదు ఏళ్లలో కోదాడలో కనీసం ఇళ్లు కట్టుకోవడానికి మట్టి కూడా దొరకకుండా చేశారని, అన్నింటికి ధరలు పెట్టి వసూలు చేశారని ఆరోపించారు. మళ్లీ బీఆర్‌ఎస్ గెలిస్తే ఇంట్లో ఉన్నందుకు కూడా పన్ను వసూలు చేస్తారని విమర్శించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం 27వ వార్డులో ముత్యాలమ్మ ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏర్నేని బాబు, మహబూబ్‌జానీ, కొల్ల ప్రసన్నలక్ష్మి, కోటిరెడ్డి, బషీర్, జబ్బార్, లంకెల కుటుంబరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, షాబుద్దీన్, బాగ్దాద్, బాజాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మోతె : మండలంలోని రాంపురంతండా, మామిళ్లగూడెం గ్రామాల్లో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మామిళ్లగూడెంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నలమాద పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ముప్పాని ఆశ, జెడ్పీటీసీ పుల్లారావు, మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, సర్పంచ్ యల్లయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుర్వారెడ్డి, మధుసుదన్ రెడ్డి, మాతృనాయక్, చిన వెంకటరెడ్డి, శ్రీనివాస్, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో అయ్యప్పస్వామి మహా పడిపూజను గురువారం రాత్రి జుట్టుకొండ సతీష్- మౌనిక దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, మంగళతోరణాలు, గ్రామ దేవతలకు పూజలు, కేరళ బృందం చేత నగర సంకీర్తన, 41 జ్యోతులు, 108 కళశాలతో గ్రామంలో ఊరేగింపు, తదితర కార్యక్రమాలను వైభంగా నిర్వహించారు. రాత్రి 9 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, వినయకపూజ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజ, శివపార్వతుల పూజ, లక్ష్మీనారాణులకు పూజ, తదుపరి బత్తిని అప్పారావు తాంత్రి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహించారు. రాత్రి 10 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, నీరాజనం మంత్రపుష్పం, హరివరాసనం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. అయ్యప్ప మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్

మునగాల : మండలంలోని రేపాల గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొల్లు ప్రసాదరావు శుక్రవారం రాత్రి కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రసాదరావు స్వగ్రామమైన సీతానగరంలోని ఆయన నివాసానికి చందర్‌రావు వెళ్లి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ నాయకులు పందిరి నాగిరెడ్డి, మండల నాయకులు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, నల్లపాటి శ్రీనివాస్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోగుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలో పాల్గొన్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో శ్రీ సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు శుక్రవారం ఉదయం సుప్రభాతసేవ, గణపతిపూజ, పూణ్యాహవచనం, నవకలశస్థాపనం, విగ్రహాలకు అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్మాణ దాతలు కీత కోటయ్యకనకమ్మ, కీత రామారావు జ్యోతి, కీత నాగేశ్వరరావు సునీత, అర్చకులు రాయప్రోలు భద్రయ్యశర్మ, రామయ్యశర్మ, ఉపేంద్రశర్మ, గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారం షురూ

మునగాల : బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం మునగాల మండలంలో ప్రచారాన్ని షురూ చేశారు. ఈ సందర్భంగా మరసకుంటతండా, కలకోవ, జగన్నాథపురం, మాధవరం గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు ఎలక వెంకటరెడ్డి, పార్టీ మండల నాయకులు సీతారాములు, ఎలక కవిత, కోల ఉపేందర్‌రావు, సుజాత, భవాని, వీరబాబు, నరసింహారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

ముమ్మరంగా కాంగ్రెస్ ప్రచారం



మునగాలలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునగాల : కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.పద్మావతిరెడ్డిను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శుక్రవారం మండల వ్యాప్తంగా ముమ్మరంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఓటర్లకు వివరిస్తూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

పంటల పరిశీలన



బూరుగడ్డలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ, అమరవరం గ్రామాల్లో రైతులు ప్రైవేటు దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసిన వరి పంట తల్లి కర్రలు కోత దశకు రాగా పిల్ల కర్రలు మాత్రం ఈత దశలో ఉండడంతో రెండురోజుల క్రితం మండల వ్యవసాయధికారులకు బూరుగడ్డ రైతు గూడెపు అంజయ్య ఫిర్యాదు చేశాడు. దీంతో కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ అసిస్టెంట్ ఎన్ లింగయ్యతో కలిసి మండల వ్యవసాయాధికారిణి రావిరాల స్వర్ణకుమారి పొలాలను పరిశీలించారు. వరి ఈత దశలోనే పంటపై పరీక్షలు చేయడానికి వీలుంటుందని ప్రస్తుతం వీలుండదని, పంట దిగుబడిలో పెద్ద తేడా ఏమి ఉండదని రైతుకు తెలిపారు. వారి వెంట జూనియర్ అసిస్టెంట్లు రాములమ్మ, పల్లవి, ఏఈఓ దొంతగాని నరేష్, రైతులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

గీత కార్మికుడికి పరామర్శ

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గుండు రాంబాబు ఇటీవల తాటి చెట్టుపై నుంచి కింద పడడంతో గాయాలయ్యాయి. శుక్రవారం ఆయనను తెలంగాణ గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అంజిబాబు పరామర్శించారు. రాంబాబుకు ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, గీత సొసైటీ అధ్యక్షుడు మండవ వీరస్వామి, పనస వెంకన్న, గోపగాని వెంకన్న, మామిడి సైదులు, శేషు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

అనంతగిరి : మండల కేంద్రంలోని కొండపై కొలువై ఉన్న హరిహర అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం అన్నదానాన్ని ఆలయ చైర్మన్ కొండపల్లి వాసు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులకు 48 రోజులపాటు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నర్సింహారావు, శ్రీను పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు మృతి

నడిగూడెం : మండలంలోని బృందావనపురానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ముసుకు వెంకయ్య (85) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, నాయకులు కొండూరు వేలాద్రి, నరేష్, శ్రీను, వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆటో యూనియన్ సమావేశం

హుజూర్‌నగర్ : పట్టణంలో శుక్రవారం ఆటో యూనియన్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలపై చర్చించారు. ఎమ్మెల్యేగా సైదిరెడ్డిని గెలిపించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పి.ఉపేందర్, శివ, నాగరాజు, వెంకటేశ్వర్లు, నాగులుమీరా, నరేష్ నరసింహ, జానీ, చారి, ఇబ్రహీం, మురళి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు మృతి తీరని లోటు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నాయుడు శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్,* సీనియర్ నాయకుడు పందిరి పుల్లారెడ్డిలు శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. కాగా, మృతునికి ముగ్గురు కుమార్తెలు, భార్య ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బొబ్బా రవీందర్‌రెడ్డి, చింతల వెంకటనారాయణ, నాగులుమీరా, జమీల్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో ఆలయానికి మరమ్మతులు

మునగాల : మండలంలోని రేపాల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో గల రేకుల షెడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సాయంతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి పునర్నించినట్లు దేవస్థానం చైర్మన్ శొంఠి పరుశరామయ్య శుక్రవారం తెలిపారు. రేపాల గ్రామానికి చెందిన రిటైర్డు పశువైద్యాధికారి గండు రామయ్య -వెంకటలక్ష్మి దంపతులు రేకుల షెడ్డు పునర్నిర్మాణానికి రూ.45వేలు ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ పరుశరామయ్య మాట్లాడుతూ రామయ్య దేవాలయ అభివృద్ధి కోసం సాయం చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు.

తొలిరోజు ఒక్క నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రజావాణి పార్టీ అభ్యర్థి వెంకటేశ్వర్లు

కోదాడ : ఈ నెల 30 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోదాడ అసెంబ్లీ స్థానానికి తొలిరోజైనా శుక్రవారం ఒక్క నామినేషన్ దాఖలైంది. ప్రజావాణి పార్టీ అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు తన నామినేషన్‌ను దాఖలు చేశారు. కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ ముందు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. కాగా, కోదాడకు చెందిన ఎన్‌ఆర్‌ఐ జలగం సుధీర్ తాను అమెరికా నుంచి ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేస్తానని సమాచారం ఇచ్చాడని, కానీ పోటీ చేసే వ్యక్తి స్వయంగా వచ్చి నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని, నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయాల్సి ఉన్నందున ఆన్‌లైన్ నామినేషన్ వీలుకాదని రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ తెలిపారు.

రిటర్నింగ్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు

కోదాడరూరల్ : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కావడడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. కోదాడలో నామినేషన్లు దాఖలు చేసే రిటర్నింగ్ కార్యాలయం వద్ద స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్లు దాఖలు చేసేవారు ఈసీ నిబంధనలు పాటించాలని అధికారులు తెలిపారు.

హుజూర్‌నగర్‌లో నామినేషన్లు నిల్

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా హుజూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పా టు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా తొలిరోజు శుక్రవారం నామినేషన్లను ఎవరూ దాఖలు చేయలేదని రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి బలం పెరుగుతోంది

- కాంగ్రెస్ హుజూర్‌నగర్ అభ్యర్థి ఉత్తమ్



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ బలం పెరుగుతోందని ఎంపీ, కాంగ్రెస్ పార్టీ హుజూర్‌నగర్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చింతలపాలెం మండలంలోని దొండపాడుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ రామిశెట్టి బాబురావు, చిలకల నాగార్జున్ రెడ్డి శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఉత్తమ్ మూడు రంగుల కండువాలను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి పుల్లారెడ్డి, ఆళ్ల గురునాథం, వెంకయ్య, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చింతిర్యాల రవీందర్, దొంగల కార్తీక్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా.. మరోసారి ఆశీర్వదించండి

- బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడరూరల్ : కాపుగల్లులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : స్థానికుడిని, ప్రజలందరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. శుక్రవారం మండలంలోని కాపుగల్లు, కూచిపూడి, కూచిపూడితండా, రెడ్లకుంట, గుడిబండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో వచ్చే టూరిస్టుల మాయమాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమాల్లో ఎన్నికల ఇన్‌చార్జ్ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, శశిధర్‌రెడ్డి, ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కాసాని వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు శంకరశెట్టి కోటేశ్వరరావు, సురేష్, భుక్యా సైదా, నాయకులు డాక్టర్ కాసాని వెంకటేశ్వర్లు, అబ్దుల్‌నబీ, రమేష్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన వ్యాపారవేత్త

కోదాడరూరల్ : మండలంలోని కాపుగల్లుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దొంతగాని అప్పారావు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ ఆయనకు పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కాసాని వెంకటేశ్వర్లు నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- బీజేపీ హుజూర్‌నగర్ అభ్యర్థి శ్రీలతారెడ్డి



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, చల్లా శ్రీలతారెడ్డి

హుజూర్‌నగర్ : నియోజకవర్గ ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం కల్పించాలని బీజేపీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్ల శ్రీలతారెడ్డి కోరారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించబడిన తర్వాత శుక్రవారం ఆమె మొదటిసారి హుజూర్‌నగర్ వచ్చారు. తొలుత పట్టణంలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం వర్తక సంఘ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత కొన్నేళ్లుగా నియోజకవర్గంలో అనుకున్నంత స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ఒక మహిళా అభ్యర్థిగా ఎమ్మెల్యే బరిలో ఉన్నానని, నియోజకవర్గంలోని మహిళలు తప్పకుండా తనను ఆదరిస్తారని నమ్మకం ఉందని ఆమె పేర్కొన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ తోడు దొంగలని వారిలో ఎవరిని గెలిపించినా అభివృద్ధి జరగదన్నారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీవీఎస్ రమేష్, వేముల శేఖర్‌రెడ్డి, అంబళ్ల నరేష్ గౌడ్, పత్తిపాటి విజయ్, బాల వెంకటేశ్వర్లు, పి.విజయ్, కుందూరు కోటిరెడ్డి, ఇంటి రవి, సత్యనారాయణరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో శ్రీలతారెడ్డి ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో బీజేపీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట ఆ పార్టీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, దేనుమకొండ రాజు, కార్యకర్తలు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- కోదాడ డీఎస్పీ ప్రకాశ్



హుజూర్‌నగర్‌రూరల్ : లింగగిరిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మఠంపల్లి : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో సమస్యాత్మక గ్రామమైన రఘునాథపాలెంలో శుక్రవారం కోదాడ డీఎస్పీ ప్రకాష్ ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ డీఎస్పీ ప్రకాశ్ మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే బాధ్యులపై చట్టరిత్యా కఠిన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో సీఐ రామలింగారెడ్డి, మఠంపల్లి ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ, సర్కిల్ పరిధిలోని వివిధ మండలాల ఎస్‌ఐలు, పోలీసులు, స్పెషల్ టీమ్ పాల్గొన్నారు.

లింగగిరిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోదాడ డీఎస్పీ బి.ప్రకాష్ సూచించారు. శుక్రవారం మండలంలోని లింగగిరిలో పోలీసులు, ఐటబీటీ సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐలు, కానిస్టేబుల్స్, సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలి

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులను ఓడించాలని తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని టౌన్ హాల్‌లో నిర్వహించిన టీజేఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా అవినీతి, నిరంకుశ, విద్వేష పాలన కొనసాగిస్తున్నాడని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ మత విద్వేష, నియంతృత్వం పాలన చేస్తుందని ఆరోపించారు. టీజేఎస్ కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతుందని, ఎన్నికల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ మండలాల అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, పుష్ప, డి.చందు నాయక్, జి వెంకటరెడ్డి, మురళినాయక్, బిక్షం నాయక్ పాల్గొన్నారు.

ఎకరానికి రూ.10 వేల నష్టపరిహారం ఇవ్వాలి

నేరేడుచర్ల : అకాల వర్షంతో పంటలు నేలకొరిగి నష్టపోయిన రైతులను ఎకరానికి రూ. 10 వేల నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నేరేడుచర్లలో అరిబండి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి పంట నెలపాలు కావడం బాధకరమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొదమగుండ్ల నగేష్, నీలా రామ్మూర్తి, తిరుపతయ్య, శ్రీధర్, సైదులు, జానీ తదితరులు ఉన్నారు.